సాక్షి
శ్రీకాకుళం

శనివారం ¦ 22 ¦ జూన్ ¦ 2024



మేఘ గర్జన..

పిడుగుపాట్లు పెరుగుతున్నాయి. వీటిపై అవగాహన అవసరం.

- 8లో



రెండు బైక్‌లు ఢీ..

నందిగాం మండలంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ముగ్గురు గాయపడ్డారు.

- 8లో

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూ పరిధిలో ఉన్న 87 ప్రైవేట్ డిగ్రీ కళాశాలను అఫిలియేషన్ కమిటీలు పరిశీలిస్తున్నాయి. జిల్లాలో పలు కళాశాలలను ద్విసభ్య కమిటీలు శుక్రవారం పరిశీలించాయి. పరిశీలన శనివారం పూర్తి కానుంది. 17 కమిటీలను కళాశాలల పరిశీలనకు అధికారులు వేశారు. పరిశీలన అనంతరం నివేదిక అందజేయనున్నారు. ఉన్నత విద్యా మండలి ఆదేశాలకు అనుగుణంగా పరిశీలన జరుగుతుంది.

న్యూస్‌రీల్

మిగులు సీట్లకు ప్రవేశాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పాఠశాలలు/కళాశాలల్లో మిగులు సీట్లను అర్హత గల విద్యార్థులకు కేటాయిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలలలో 2024–25 విద్యా సంవత్సరానికి పాత జిల్లా ప్రాతిపదికన (4 బాలురు, 7 బాలికలు) మొత్తం 11 గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న మిగులు సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. ఈ సీట్లలో చేరగోరు విద్యార్థులు మిగిలిపోయిన సీట్ల కోసం నేరుగా తాము చేరగోరు పాఠశాల/కళాశాలలకు ఈనెల 26తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 29తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆయా విద్యాలయాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించి చేర్చుకుంటామని తెలిపారు.

సమాచారం అందిన వెంటనే స్పందించాలి



టెక్కలిలో 108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ హరిప్రసాద్

టెక్కలి: సమాచారం అందిన వెంటనే తక్షణమే స్పందించే విధంగా 108 సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా మేనేజర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. టెక్కలిలో గల 108 వాహనాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలో పరికరాల వినియోగం, మందుల నిల్వలు తదితర రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో నాణ్యమైన సేవలు అందజేయాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు సిబ్బంది జగదీష్, శశి తదితరులు ఉన్నారు.

502 మందికి ప్రవేశాలు



విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. 1400 నుంచి 1642 ర్యాంకు మధ్య విద్యార్థులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించగా, 474 మందికి 230 మంది హాజరయ్యారు. 113 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో ఇప్పటి వరకు 502 మందికి ప్రవేశాలు కల్పించారు. 1874 నుంచి 2083 ర్యాంకు మధ్య విద్యార్థులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను కన్వీనర్ ఎల్. సుధాకర్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు పరిశీలించారు.

ఏపీటీఎఫ్ విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



మందస మండలం హరిపురంలో పోస్టర్ ఆవిష్కరణలో ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.భీమారావు అన్నారు. విద్యారంగం–కొత్త ప్రభుత్వం–కొత్త ఆశలు అనే అంశంపై సదస్సు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, నాయకులు డి.రామారావు, డాక్టర్ భైరాగి, బి.మురళీ మోహన్, పి.పూర్ణచంద్రరావు మాట్లాడనున్నారని తెలిపారు. అనంతరం వీవీ వరప్రసాద్‌ను సత్కరించనున్నామని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సదస్సుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, రఘువర్మ, ఉమారాజ్, వారణాశికళ, భానుమూర్తి, సరస్వతి, మదన్‌మోహన్, అనిల్ కుమార్, సుభాష్‌బాబు, చాణక్య, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక సాగేనా..?



పంట భూమిని దున్నుతున్న రైతు

- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- ఆరుద్ర కార్తె వచ్చినా కరుణించని వరుణుడు
- ఉరుములు, మెరుపులే తప్ప కానరాని భారీ వాన
- ఆందోళనలో శివారు రైతులు



వజ్రపుకొత్తూరు రూరల్: ఆరుద్ర కార్తె వచ్చేసింది. సాధారణంగా ఈ సమయానికి ఆకుమడుల పనుల్లో రైతులు మునిగి తేలుతుంటారు. కానీ ఈ ఏడాది సాగు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జిల్లాను అప్పుడప్పుడు పలకరిస్తున్న వరుణుడు రైతును మాత్రం కరుణించడం లేదు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వేసవి చివరిలో కురిసిన వర్షాలకు రైతులు నారు మడులను సిద్ధం చేశారు. మొదటి విడతగా దుక్కిపనులు కూడా చేశారు. అలాగే విత్తనాల సేకరణలో ప్రస్తుతం బిజీబిజీగా ఉన్నారు. వానలు మెండుగా కురిస్తే వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే రైతు ఆశించిన మేర జిల్లాలో వానలు కురవడం లేదు. వాతావరణ శాఖాధికారులు పిడుగులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్నా.. పిడుగులు, మెరుపులు తప్ప వానలు పెద్దగా పడడం లేదు.

కొన్ని చోట్లే వాన..

జూన్–సెప్టెంబర్ నైరుతి రుతు పవనాలు భారతదేశ వార్షిక వర్షపాతంలో 70 శాతం కంటే ఎక్కువగా వస్తాయి. అయితే ఈ ఏడాది జూన్ తొలి వారంలోనే నైరుతి రుతు పవనాలు పలకరించడంతో పిడుగులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. కానీ జిల్లాలో కొన్ని చోట్ల మాత్రమే భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆరుద్ర కార్తెలో ఏరువాక పౌర్ణమి రోజున విత్తనాలు వేసుకునేందుకు సరైన సమయం కావడంతో విత్తనాలు వేసేందుకు ఎదురుచూస్తున్నారు. అయితే పంట పొలాల్లో తడి ఆవిరి కూడా లేకపోవడంతో విత్తనాలు వేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే తమంత అదృష్టవంతులు ఎవరూ ఉండరని రైతులంటున్నారు.



ఊరిస్తున్న మేఘాలు

శివారుకు కష్టమే..

ఒక వైపు వర్షాలు లేకపోవడంతో నదులు, గెడ్డలు, కాలువల్లో నీరు అడుగంటిపోయింది. మరోవైపు భానుడు ఉగ్రరూపం దాల్చడంతో శివారు గ్రామాలకు నీరు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఈ పరిస్థితులు రైతుకు ఆదిలోనే హంసపాదుగా మారుతోంది. వర్షాలు సకాలంలో కురవకపోతే చాలా మంది వంశధార నీటిపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వంశధార శివారు భూములకు సాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం



గత నెలలో కురిసిన కొద్ది పాటి వర్షాలకు పంట పొలం దుక్కి చేశాం. ప్రస్తుతం వర్షాలు లేక మండుతున్న ఎండలతో దుక్కి చేసిన భూమి ఎండిపోయి బెడ్డలు గట్టింది. ఇప్పుడు వర్షం కురిస్తే గానీ వరి విత్తనాలు వేయలేని పరిస్థితి. ఇప్పటికే విత్తనాలు సేకరించి వాటిని పంట పొలాల్లో జల్లేందుకు సిద్ధంగా ఉన్నాం.

–టి.అప్పలస్వామి, రైతు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

వంశధార నీరు అందించండి



ఏటా వర్షాలు లేక, వంశధార నీరు అందక పంట నష్టపోతున్నాం. ఈ ఏడాది పంట సాగుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తాయని ఎదురుచూస్తున్నా నిరాశ కలుగుతోంది. మా ప్రాంతానికి సాగు నీరు మాత్రం ప్రశ్నార్థకంగా ఉంది. ప్రభుత్వం స్పందించి నీరు అందించాలి. – టి.అప్పారావు, వంశధార శివారు గ్రామ రైతు, వజ్రపుకొత్తూరు మండలం

తొందరపడి విత్తుకోవద్దు



పంట పొలంలో నీరు లేకుండానే పొడి దుక్కులు

ఇచ్ఛాపురం రూరల్: వర్షాలు పడక ముందే రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దని సోంపేట వ్యవసాయ ఉపసంచాలకులు జగన్మోహనరావు అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ భూమిలో వేడి తగ్గాక విత్తుకోవడం ద్వారా మొలక శాతం మెరుగ్గా ఉంటుందన్నారు. పొడి దుక్కులో విత్తితే సరిపడా వర్షాలు పడని పక్షంలో విత్తనాలు భూమిలోనే కుళ్లిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. రైతులు రెండోసారి విత్తనాలు వేసుకోవాల్సి వస్తుందని తెలిపారు. మున్ముందు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోందని, విత్తనాలు వేసుకోవడానికి, నారుమడులు తయారు చేసుకోవడానికి ఇంకా సమయం ఉందన్నారు.

90 శాతం సబ్సిడీకి విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



టెక్కలిపట్నంలో ఏరువాక నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు

కాశీబుగ్గ: తొంభై శాతం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందజేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు చాపర వేణుగోపాలరావు కోరారు. పలాస మండలం టెక్కలిపట్నం గ్రామంలో శుక్రవారం ఏరువాక కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస పరిసర ప్రాంతాల్లో 30వేల ఎకరాలకు ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు అందించాలని కోరారు. అరవై ఏళ్లు నిండిన రైతులకు రూ.10వేల ఫించన్ అందించాలని, స్వామినాథన్ కమిటీ ప్రకారం రైతులకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు యు.నేతాజీ, జె.బాబూరావు, జి.వాసుదేవరావు, గోవింద, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ వరుస దాడులతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. డోకులపాడు పంచాయతీ పరిధిలో గల రేపల్లికి చెందిన రెండేళ్ల చిన్నారి హాసినిపై శుక్రవారం వీధికుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారి చేతిపై గాయాలయ్యాయి. అలాగే గురువారం చినడోకులపాడు గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల చిన్నారి రిషికాపై దాడి చేసి ముఖంపై గాయపర్చాయి. దీంతో చిన్నారులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఇంటి పరిసరాల్లో ఆడుకుంటున్న చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసిన సమయంలో స్థానికులు అప్రమత్తం కావడంతో చిన్నారులకు పెను ప్రమాదం తప్పింది. అలాగే ఇటీవల మూగ జీవాలపై దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయి. గ్రామ వీధుల్లో, రోడ్లపై వీధికుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ జీవాలపై దాడులు చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అయితే వీధు కుక్కల సంచారాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి హాసిని

ఆమె ఆచూకీ దొరికేనా..?

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ప్రభుత్వాస్పత్రి నుంచి ఓ కేసులో నిందితురాలు పరారవ్వడంతో ఆమె ఆచూకీ కోసం పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఒకటో పట్టణ పోలీసులు చెప్పిన వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 18న ఎచ్చెర్ల నవభారత్ జంక్షన్‌లో తన పిల్లలతో కలిసి నివసిస్తున్న దాసరి మంగపై శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన ఆరుగురు మహిళలు అల్లిబిల్లి రాధ, కోడ భవానీ, అల్లిబిల్లి లక్ష్మి, కుందు జయ, అల్లిబిల్లి నీలిమ, మైలపల్లి కృష్ణవేణిలు ఆటోలో వెళ్లి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి ఒకటో పట్టణ పోలీసులు అల్లిబిల్లి రాధ, కుందు జయ, కోడ భవానీలను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అదే సమయంలో రాధ కుమార్తె భవానీ తనకు ఆరోగ్యం బాగోలేదని పోలీసులకు చెప్పడంతో ఆమెను రిమ్స్‌లో చేర్పిస్తూ రాధ కూడా వెళ్లింది. అయితే అప్పటికే తనపై ఎచ్చెర్లలో కేసు నమోదవుతుందని గ్రహించిన రాధ పోలీసుల కన్నుగప్పి అక్కడి నుంచి పరారైంది. 19న మిగిలిన వారిని అరెస్టు చేశారు.

న్యాయం చేయండి..

నవభారత్ జంక్షన్‌లో తాను నివసిస్తున్న ఇంటికొచ్చి దాడి చేయడమే కాక ఆటోలో నగరంలోని దమ్మలవీధికి తీసుకెళ్లి వివస్త్రను చేసి వందల మందిలో తనను ఊరేగించారని దాసరి మంగ శుక్రవారం మీడియా సమావేశంలో తన ఆవేదన వెలిబుచ్చారు. తనకు పోలీసులు న్యాయం చేయాలని, తప్పించుకున్న రాధను, ఆమె కుమారున్ని కూడా అరెస్టు చేయాలని దాసరి మంగ పోలీసులను కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

అతిసార వ్యాధులు అరికట్టేందుకు చర్యలు

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అతిసార వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. అతిసార కేసుల వ్యాప్తి అరికట్టడంతో పాటు ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలన్నారు. కేసుల వ్యాప్తి అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ/మానిటరింగ్ మెకానిజం అత్యంత ముఖ్యంగా అమలు చేయాలన్నారు. ఈ విషయమై వర్క్‌షాప్ నిర్వహించాలని, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేయాలని, ఆశా వర్కర్ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఐఈసీ యాక్టివిటీలను చేపట్టాలన్నారు. చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం, తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించడం చేయాలని సూచించారు. ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రసాదరావు, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ జి.జె. బెనహర్ పాల్గొన్నారు.



యోగా ఆసనాలు వేస్తున్న చిన్నారులు



ఆసనోత్సవం

యోగా దినోత్సవం సందర్భంగా ఊరూరా ఆసనోత్సవాలు జరిగాయి. పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులు యోగా ఆవశ్యకతను వివరిస్తూ ఆసనాలు వేశారు. కేజీబీవీల్లో ప్రత్యేక ప్రదర్శనలు చేశారు. ఉపాధి వేతనదారులు సైతం తామేమీ తక్కువ కాదంటూ ఉపాధి పనుల వద్ద ఆసనాలు వేసి చూపించారు.

– సాక్షి నెట్‌వర్క్, శ్రీకాకుళం



సంతబొమ్మాళి: దండుగోపాలపురం విద్యార్థుల ప్రదర్శన



శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆసనాలు వేస్తున్న ఎస్పీ రాధిక, అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్



గార: కేజీబీవీ విద్యార్థుల విన్యాసం



జలుమూరు: యోగాసనాలు వేస్తున్న కేజీబీవీ విద్యార్థులు



ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఆసనాలు



కవిటి: కవిటి కేజీబీవీ కేంద్రంలో బాలికల ప్రదర్శన



శ్రీకాకుళంలో ఆసనాలతో విన్యాసాలు



కాశీబుగ్గ: విద్యార్థుల ప్రదర్శన



ఎచ్చెర్ల: బుడుమూరులో యోగాసనాలు వేస్తున్న ఉపాధి పథకం వేతదారులు

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి



మాజీ న్యాయమూర్తి ఎం.ఎం.సీతారాంకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.సీతారాం శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ నేతృత్వంలో జస్టిస్‌కు గోత్ర నామాలతో పూజలు చేయించారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, డీఎల్ఎస్ఏ కోర్టు న్యాయమూర్తి సన్యాసినాయుడు, ఆలయ సిబ్బంది బీఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు



పార్వతీ పరమేశ్వరులకు చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని చక్రతీర్థ స్నానాలు పుణ్య వంశధార నదిలో ఘనంగా శుక్రవారం జరిగాయి. గణపతి పూజతో ప్రారంభమై పార్వతీ పరమేశ్వరులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆసీనులుగా చేశారు. అనంతరం వంశధార నదిలో స్వామివారి సహిత వారాహి అమ్మవారికి పుణ్య చక్రతీర్థ సాన్నాలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో యథాస్థానంలో ఉంచి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో అర్చకులు శేషాచలం, అప్పారావు, ధనాలస్వామి, శివాజీ భక్తులు పాల్గొన్నారు.

'కేసులు త్వరగా పరిష్కరిద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఆగూరు ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో 'మధ్యవర్తిత్వంతో ప్రజలకు జరిగే మేలు' తదితర అంశాలపై చర్చించారు. గత మూడు రోజులుగా న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ అందజేస్తున్నారు. శుక్రవారం ఈ శిక్షణలు బార్ కార్యాలయంలో నిర్వహించారు. బార్ అధ్యక్షుడు ఈశ్వరరావు, ఇతర సభ్యులు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఈ శిక్షణను ప్రారంభించారు. సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్ట్ కమిటీ శిక్షకులు మధ్యవర్తిత్వ భావన-సాంకేతికతలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదుల వారి సందేహాలను, అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల నివేదికకు కసరత్తు



పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

పొందూరు: జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల వివరాల కోసం ప్రభుత్వం కోరిన పూర్తిస్థాయి నివేదికలు తయారు చేసేందుకు కసరత్తు ప్రారంభించామని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం పొందూరు ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యాకిట్ల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఖాళీల సంఖ్య నిర్ధారిస్తామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు యూడైస్ కోడ్ ప్రక్రియ కొనసాగుతోందని, తక్షణమే పూర్తిచేయాలని ఎంఈఓలను ఆదేశించారు. ఆయనతో పాటు ఎంఈఓలు పీవీ రామరాజు, పి.రాజారావు, హెచ్‌ఎం. వెంకట్రావు ఉన్నారు.

డాక్టర్ కుమార్‌నాయక్‌కు దాసరి అవార్డు

పలాస: పలాసకు చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, సినీ నటుడు డాక్టర్ కుమార్‌నాయక్‌కు దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అవార్డు లభించింది. ఈ మేరకు విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో గురువారం నిష్ణాతులైన వ్యక్తులకు ఘనంగా సన్మానం చేసి సత్కరించారు. కుమార్‌నాయక్‌తో పాటు పలువురు సినీ దర్శకులు తదితరులు ఏడుగురికి జాతీయ అవార్డులు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ ఫేమ్ శివజ్యోతి, బొమ్మిడి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేఘ గర్జన.. అవగాహనే రక్షణ

- గురువారం బూర్జలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ఇద్దరు మృతి
- మూడేళ్లలో 38 మంది బలి
- వాతావరణ మార్పులే ప్రధాన కారణం
- అవగాహన కలిగి ఉండాలంటున్న నిపుణులు



పిడుగుపాటుకు అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఇటుక బట్టీ కార్మికులు(ఫైల్)



మెరుపు

ఇచ్ఛాపురం రూరల్:

- సెల్‌ఫోన్ సిగ్నల్ రావడం లేదని డొంకూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు బుద్ద కాంతారావు తన ఇంటి మేడ పైకి ఎక్కి మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.
- జగన్నాథపురం గ్రామానికి చెందిన జయ తోటి స్నేహితులతో కలసి వస్తుండగా, దారిలో వర్షం పడటంతో చెట్టు కింద నిల్చున్నారు. ఇంతలో ఆమెపై పిడుగుపడి మృతి చెందారు.
- వర్షం కురుస్తుండటంతో ఉపాధి పనులు అర్ధంతరంగా నిలిపి వేయడంతో పరుగు పరుగున ఇంటికి వస్తున్న క్రమంలో.. ఈదుపురం వంతెన వద్ద నీలాపు ఈశ్వరి అనే ఉపాధి కూలీపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు.
- గురువారం బూర్జ మండలం అయ్యవారిపేటకు చెందిన చోడవరపు వెంకటసత్యనారాయణ అనే యువకుడు పొలాల్లో ఆవులు మేపుతుండగా, వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లి పిడుగుపాటుకు గురై మృతి చెందగా, అదే మండలం తమ్మినాయుడు పంచాయతీ కటకమయ్యపేటలో దేవరపల్లి బారికయ్య అనే వ్యక్తి పొలం పనులు చేస్తుండగా అయనపై పిడుగు పడి మృతి చెందాడు.

ఒకరు కాదు ఇద్దరు కాదు మూడేళ్లలో 38 మంది ఈ పిడుగుపాట్లకు బలైపోయారు. ఏటా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పిడుగుపాట్లు అధికమవుతున్నాయి. వర్షాకాలంలో వ్యవసాయ, ఉపాధి పనుల్లో నిమగ్నమయ్యే రైతులు, కూలీలు, పశువుల కాపరులు, రోడ్లపై వెళ్లే వాహనదారులు అధికంగా పిడుగుపాటుకు గురవుతున్నారు. అవగాహన కలిగి ఉంటే పిగుడుపాటు నుంచి రక్షించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

కాపర్ ఎర్తింగ్..

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు కాపర్ ఎర్త(రాగి తీగ)ను ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని భవనం పైనుంచి భూమి లోపలి వరకు ఏర్పాటు చేయాలి. కిలోమీటరు దూరంలో పిడుగుపడినా భూమి ఆకర్షిస్తుంది. రాగితీగను ఏర్పాటు చేసుకునే సమయంలో ఉప్పుతో పాటు బొగ్గు కలిపి అందులో వేయాలి. శక్తివంతమైన విద్యుత్ ప్రవాహం పిడుగు రూపంలో కిందకి వచ్చినప్పుడు కాపర్(రాగి) తీగ ఆపే అవకాశం ఉంది. టవర్లు, సినిమా హాళ్ల వద్ద ఇలాంటివి ఏర్పాటు చేస్తారు. భవనాలు, పరిశ్రమలు అంతస్తులపై రాగి కడ్డీలను ఏర్పాటు చేసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కిందకు వెళ్లకూడదు. విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదు. చెట్లు, స్తంభాలకు దూరంగా ఉండాలి.
- ఇంట్లో ఉన్న స్విచ్‌బోర్డుల నుంచి ప్లగ్గులు తొలగించాలి. టీవీలకు ఉన్న కేబుల్ తీగలు తొలగించాలి. అలాగే ఉంచితే ఎలక్ట్రికల్ వస్తు సామగ్రి దెబ్బతినే ప్రమాదం ఉంది.
- ఉరుములతో కూడిన వర్షం పడుతుంటే కిటికీలు, తలుపుల వద్ద ఉండి బయటకు చూడవద్దు. కిటికీ తలుపులు మూసివేయాలి.
- ఎత్తైన ప్రదేశంలో నించుని ఫోన్ మాట్లాడకూడదు. ఎడ్ల బండ్లు, ద్విచక్రవాహనాలు నడపవద్దు.
- అధిక నీరు ఉన్న చోట ఉండటం గానీ, నీళ్లలో ఈత కొట్టడం గానీ చేయకూడదు.

ఆరుబయటే ఉంటే

- వర్షం కురిసే సమయంలో పొలాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పిడుగు పడే సమయంలో బయట ఉంటే అరచేతులతో చెవులు మూసుకొని, నేలపై మోకాళ్ల మీద కూర్చొని తల కిందకు వంచాలి.
- వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు దూరంగా ఉండాలి.
- ఈదురు గాలులు, వర్షం పడే సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు కింద ఉండరాదు.
- చేతిలో సెల్ ఫోన్ ఉంటే స్విచ్ఛాఫ్ చేయాలి.
- గుండె జబ్బులు ఉన్న వారు వర్షం, ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

పిడుగు పాటుకు గురైతే..



పిడుగుపాటుకు గురైన వారు ప్రాణాపాయం నుంచి బయటపడటం అరుదు. అస్వస్థతకు గురైన వారిని వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి. పిడుగు పడిన ప్రదేశం తడిగా ఉంటే బాధితులను దుప్పటిపై పడుకోబెట్టాలి. ఊపిరి ఆగిపోతే కృత్రిమ శ్వాస అందించాలి. గుండె కొట్టుకోవడంలో తేడాలు గమనిస్తే ఆస్పత్రికి తీసుకువెళ్లే వరకు రెండు చేతులతో ఛాతీ పైభాగాన్ని గట్టిగా ఒత్తుతూ ఉండాలి.

– డాక్టర్ రేవతి భేరి,
ప్రభుత్వ వైద్యాధికారి, కొళిగాం

అప్రమత్తంగా ఉండాలి

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చెట్ల కిందకు, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లరాదు. సెల్ ఫోన్ వినియోగించకూడదు. పిడుగులు గుర్తించేందుకు ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. వజ్రపాత్ యాప్ ద్వారా పిడుగులు పడే అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించవచ్చు. ఇళ్లు, భవనాలపై లైటినింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకుంటే పిడుగుల ముప్పు తప్పించుకోవచ్చు.

– సాహుకారి కృష్ణమూర్తి,
రిటైర్డ్ సైన్స్ టీచర్, ఇచ్ఛాపురం

వైభవంగా త్రిశూల స్నానాలు



ఉత్సవ మూర్తులను నదిలో స్నానానికి తీసుకెళ్తున్న దృశ్యం



త్రిశూల స్నానాలు చేయిస్తున్న అర్చకులు



ఉమారుద్రునికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉమారుద్రకోటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం త్రిశూల స్నానాలతో కల్యాణ వేడుకలు ముగిశాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలతో, వేదమంత్రాల నడుమ ఊరేగింపుగా నాగావళి నదికి తీసుకెళ్లి, అక్కడ శాస్త్రోక్తంగా పూజలు చేసి త్రిశూల స్నానాలు చేయించారు. ప్రముఖ వేద పండితులు ఆరవెల్లి హరగోపాల శర్మ పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిగింది. అనంతరం మూలవిరాట్ ఉమారుద్రకోటేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ డీఈఓ విజయకుమారి

నరసన్నపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత బాగుండాలని, లేకుంటే చర్యలు తప్పనిసరని డిప్యూటీ డీఈఓ విజయ కుమారి అన్నారు. మండలం ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్కూల్‌లో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ బృందానికి పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు పడ్డాయని, ఆంగ్ల బోధన అందిస్తున్నామని వీటిని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇప్పటి నుంచే పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సారాబట్టీలపై పోలీసుల సంయుక్త దాడులు



సవర ముకుందాపురంలో స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసు బలగాలు

మెళియాపుట్టి: మండలంలోని సవర ముకుందాపురం గిరిజన గ్రామంలో టెక్కలి, పలాస టాస్క్ ఫోర్స్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సంయుక్తంగా సారా తయారీ స్థావరాలపై శుక్రవారం దాడులు చేశాయి. ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయగా.. 45 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇటీవల అత్యధికంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని గిరిజన గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటుసారా తయారీని నిలువరించేందుకు కృషి చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను తెలియపరచి, సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని సూచనలు చేశారు. టెక్కలి సీఐ రాజశేఖర్ నాయుడు, ఎస్సై గణేష్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీలో పెట్రోల్ ఖర్చు తడిసి మోపెడు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అధికారుల పెట్రోల్ ఖర్చు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కొందరు వర్సిటీ ఉద్యోగులు ఆకాశ వాణి పేరుతో ఉన్నత విద్యాశాఖకు ఈ మేరకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలో ముగ్గురు అధికారులు ఇన్నోవా కార్లు వాడుతున్నారు. కొందరు నెలకి రూ. 60 వేలు దాటి పెట్రోల్ బిల్లు పెడుతున్నట్లు సమాచారం. వాస్తవంగా కారు రీడింగ్ లాగ్ పుస్తకంలో పక్కాగా నమోదు చేయాలనే నిబంధన ఉంది. అయితే శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం రోజూ ప్రభుత్వ కారుపై రాకపోకలు సాగిస్తున్న అధికారి లాగ్ పుస్తకంలో తప్పుడు రీడింగ్, ప్రాంతాలు నమోదు చేస్తున్నట్లు సమాచారం. అధికారులు వర్సిటీకి నాలుగు కిలోమీటర్లు పరిధిలో మాత్రమే ఉండాలి. ప్రభుత్వం హెచ్‌ఆర్ఏ సైతం చెల్లిస్తుంది. కారును సైతం అవసరం మేరకు వర్సిటీ అఫిలియేషన్ కళాశాలలు ఉన్న ప్రాంతాలకు మాత్రమే నిబంధనల మేరకు వినియోగించాల్సి ఉంటుంది. అయితే కార్లను నిబంధనలు దాటి వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించటం, వేలల్లో పెట్రోల్ బిల్లులు పెట్టటం వంటివి వర్సిటీలో చర్చనీయాంశంగా మారాయి. రిజిస్ట్రార్ పి.సుజాత వద్ద ఈ అంశం ప్రస్తావించగా, నిబంధనల మేరకు మాత్రమే పెట్రోలు బిల్లులు పెడుతున్నట్లు చెప్పారు. వర్సిటీ అధికారులకు పెట్రోల్ పరిమితి ఖర్చులు వర్తించవని తెలిపారు.

టీడీపీ అణచివేత చర్యలపై దళితుల ఆగ్రహం



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎం, దళిత జేఏసీ నాయకులు

శ్రీకాకుళం: దళిత సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌కు పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంపై అంబేడ్కర్ ఇండియా మిషన్ ఏఐఎం రాష్ట్ర యువ సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను, దళిత జేఏసీ నాయకుడు కంత వేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ కూడలి వద్ద శుక్రవారం అంబేడ్కర్ ఇండియా మిషన్(ఏఐఎం) ఆధ్వర్యంలో ఏఐఎం సైనికులు, దళిత జేఏసీ నాయకులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేశారు. ఐ స్టాండ్ విత్ పీవీ సునీల్ కుమార్ అంటూ నినాదాలు చేసి, డేఅండ్‌నైట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. ఈ సందర్భంగా శ్రీను, వేణులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులపై కొత్తగా అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. నిజాయితీగా పనిచేసే అధికారుల సేవలను వినియోగించుకోవాలే తప్ప పోస్టింగ్‌లు ఇవ్వకుండా పక్కన పెట్టడం అంటే కక్ష సాధింపు చర్యల కిందకే వస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకుని దళిత సీనియర్ ఐపీఎస్ అధికారి సేవలను వినియోగించుకోవాలన్నారు. దళిత జేఏసీ నాయకులు గుజ్జల గురుమూర్తి, ఏఐఎం నాయకులు పురుషోత్తం రాంబాబు, కొత్తూరు సత్యనారాయణ, సింకు రమణ, అరిబారిక రాజు, ఎన్.అప్పారావు, చుక్కా రాంబాబు, త్రినాథ్, మహేష్, మురళీ, రాజేశ్వరి, మల్లెమ్మ, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

బదరీనాథ్‌లో నడగాం వాసి మృతి



సుధాకరరావు (ఫైల్)

నరసన్నపేట: మండలం నడగాంకు చెందిన విశ్రాంత పంచాయతీ కార్యదర్శి దొంపాక సుదాకరరావు(68) బదరీనాథ్‌లో అస్వస్థతకు గురై మృతి చెందారు. వారం కిందట ఆయన తన భార్య అప్పలనర్సమ్మ కలసి తీర్థయాత్రలకు ప్రైవేటు ట్రావెల్ బస్సులో వెళ్లారు. బదరీనాథ్‌లో దర్శనం చేసుకుని ఆలయం నుంచి బయటకు వస్తున్న క్రమంలో గుండెపోటు వచ్చి ఆలయ ప్రాంగణంలోనే శుక్రవారం మృతి చెందారు. కళ్ల ముందే విషాదం జరగడంతో భార్య అప్పలనర్సమ్మ తట్టుకోలేకపోయారు. సమాచారం గ్రామానికి చేరడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుమారుడు పవన్ కుమార్ తెలిపారు. ఆయన మృతికి వైఎస్సార్ సీపీ నాయకులు లుకలాపు రవి, త్రినాధరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఒలింపియాడ్‌లో బోరుభద్ర విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష సెమ్స్ ఒలింపియాడ్‌లో బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పట్నాన మృదుల రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. అలాగే పాఠశాలకి చెందిన పొట్నూరు హరేంద్ర జోనల్ స్థాయిలో 5వ ర్యాంకు, జవ్వాది జాహ్నవి 9వ ర్యాంకు, సార ఇందు 16వ ర్యాంకు, మార్పు కీర్తిక 17వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు బహూకరిస్తారని సెమ్స్ ఒలింపియాడ్ సంస్థ నుంచి వర్తమానం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, డి.ఉపాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.విటిరెడ్డి, జి.జగదాంబ, బి.రజిని, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, ఎ.శంకరరావు, బి.కమలకుమారి, గోపాలరెడ్డి, సుశీలదేవి, కృ సాయిశివాని, త్రివేణి అభినందించారు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడి కాలు విరిగిపోయిన పాపారావు

నందిగాం: మండలంలోని పెంటూరు గ్రామ సమీప రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వజ్రపుకొత్తూరు మండలం గూనాలపాడు(ఉప్పరపేట) గ్రామానికి చెందిన చెన్నంశెట్టి పాపారావు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై పూండి నుంచి నందిగాం వైపు వస్తున్నారు. అలాగే పెంటూరు గ్రామానికి చెందిన సనపల నాగభూషణం తన భార్య లలితమ్మతో కలసి రెయ్యిబోడమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ కార్యాక్రమానికి వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు పెంటూరు సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ప్రమాదంలో పాపారావు ఎడమకాలు విరిగిపోయింది. అలానే నాగభూషణం దంపతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పాపారావు కుమారుడు ధర్మారావు ఫిర్యాదు మేరకు నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



కమల్‌కు సపర్యలు చేస్తున్న వాహనదారులు

ఇచ్ఛాపురం రూరల్: ఎదురుగా వస్తున్న మేకల్ని తప్పించుకునే క్రమంలో స్కూటీతో కింద పడిన యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం కండ్రవీధికి చెందిన కమల్ బెహరా అనే యువకుడు శుక్రవారం తన స్కూటీపై ఈదుపురం వైపు వస్తుండగా, అదే దారిలో వంతెనపై ఎదురుగా మేకలు వస్తుండటంతో వాటిని తప్పించే ప్రయత్నంలో మేకను ఢీకొట్టాడు. అయితే మేక తప్పించుకోవడంతో కమల్ బెహరా తన స్కూటీతో కింద పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అటువైపుగా వస్తున్న వాహనదారులు వెంటనే ప్రథమ చికిత్స అందించి అటువైపుగా వస్తున్న అతని స్నేహితులకు అప్పగించి, ఇచ్ఛాపురం ఆస్పత్రికి తరలించారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

ఎచ్చెర్ల: లావేరు మండలం లోపెంట గ్రామానికి చెందిన భార్యాభర్తలు అలుపాన అప్పలనాయుడు, అప్పయ్యమ్మలపై గత నెల 22వ తేదీన దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన తాత, బంగారి, లక్ష్మీనారాయణలను లావేరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అలుపాన అప్పలనాయుడు, అప్పయ్యమ్మల పెద్ద కోడలైన రూపమ్మ తన పిల్లలను కొడుతుండగా రూపమ్మను అత్తమామలు మందలించారు. ఈ విషయం తెలుసుకున్న రూపమ్మ తండ్రి తాత, అన్నదమ్ములు బంగారి, లక్ష్మీనారాయణలు అప్పలనాయుడు, అప్పయ్యమ్మ దంపతులపై దాడికి పాల్పడ్డారు. దీంతో గాయాలపాలైన వీరు లావేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ స్వామినాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల: లావేరు మండలం గుర్రాలపాలేం గ్రామానికి చెందిన గట్టెం సత్యనారాయణ (44) అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న ఈయన ఈ నెల 18 వ తేదీన ఇంటిలో ఉన్న గడ్డి మందును తాగారు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. ఈయనకు భార్య తేజతో పాటు మౌనిక, హేమలత అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య తేజ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.